# సాక్షి
## పశ్చిమగోదావరి

శుక్రవారం । 22 । నవంబర్ । 2024






### పని బారెడు.. వేతనం మూరెడు

అంగన్‌వాడీ మినీ సెంటర్ల వర్కర్ల పరిస్థితి పని బారెడు.. వేతనం మూరెడు అన్న చందంగా ఉంది. దీంతో వారు ఉద్యమ బాట పట్టారు. 8లో ▸



### దారి దోపిడీ దొంగల అరెస్ట్

దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను ద్వారకాతిరుమల మండలం కప్పలగుంటలో పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో ▸

### సోమేశ్వరుడి శోభ



భీమవరం(ప్రకాశం చౌక్): పంచారామ క్షేత్రం ఉమా సోమేశ్వర జనార్దన స్వామి ఆలయం (సోమారామం)లో స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. ప్రత్యేక అలంకరణలో స్వామి దర్శనమిచ్చారు.

# ఇంటింటా క్యాన్సర్ సర్వే

- జిల్లాలో ముమ్మరంగా నిర్వహణ
- ఈనెల 16న ప్రారంభం
- 18 ఏళ్లు నిండిన వారికి ప్రాథమిక పరీక్షలు
- జిల్లాలో 13.22 లక్షల మంది లక్ష్యం
- ఇప్పటివరకూ 15,304 మందికి పూర్తి



భీమవరం మండలం మత్స్యపురిలో క్యాన్సర్ సర్వే చేస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

భీమవరం (ప్రకాశంచౌక్): క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టడంలో భాగంగా వైద్యారోగ్య శాఖ జిల్లాలో క్యాన్సర్‌పై ఇంటింటా సర్వే చేపట్టింది. జిల్లాలో ఈనెల 16 నుంచి క్యాన్సర్ సర్వేలో భాగంగా స్క్రీనింగ్ ముమ్మరంగా జరుగుతోంది. 18 ఏళ్లు నిండిన వారందరినీ పరీక్షించి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. నోటి క్యాన్సర్, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌లపై పీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణలో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సర్వే చేస్తున్నారు. యాప్‌లో 150 ప్రశ్నలు ఆయా క్యాన్సర్లకు సంబంధించి ఉంటాయి. వాటిని వైద్య సిబ్బంది సర్వే చేస్తున్న వ్యక్తిని అడిగి వారి సమాధానాలను యాప్‌లో పొందుపరుస్తున్నారు. దీని ద్వారా వ్యక్తి ఆరోగ్య స్థితి తెలుసుకుని వారికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయో లేదో ప్రాథమికంగా గుర్తిస్తున్నారు. సర్వేలో క్యాన్సర్ లక్షణాలు గుర్తిస్తే వారి వివరాలను పీహెచ్‌సీ వైద్యులకు అందించగా తదుపరి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభమని, ఈ దిశగా సర్వేను వచ్చే ఏడాది ఆగస్టు వరకు నిర్వహించనున్నారు.

**30 ఏళ్ల దాటిన మహిళలకు..** జిల్లాలో 30 ఏళ్లు దాటిన మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌పై స్క్రీనింగ్‌ను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. వీరికి 18 ఏళ్లు నిండిన వారి మాదిరిగా నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ కూడా చేస్తున్నారు. పురుషులకు కేవలం నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ మాత్రమే చేస్తున్నారు.

**9 మంది గుర్తింపు :** జిల్లాలో మొత్తం జనాభా 17.79 లక్షల మంది ఉంటే 18 ఏళ్లు దాటిన వారు 13.22 లక్షల మంది ఉన్నారు. ఇప్పటివరకు 5,413 కుటుంబాలకు క్యాన్సర్ సర్వే పూర్తిచేయగా, 15,304 మందికి సమగ్ర స్క్రీనింగ్ చేశారు. 9 మందికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. నోటి క్యాన్సర్ లక్షణాలు కలిగిన వారు ముగ్గురు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలు కలిగిన వారు నలుగురు, రొమ్ము క్యాన్సర్ లక్షణాలు కలిగిన వారు ఇద్దరిని గుర్తించారు.

### ప్రాథమిక దశలోనే గుర్తించేలా..



జిల్లాలో క్యాన్సర్ సర్వే ముమ్మరంగా సాగుతోంది. ప్రత్యేక యాప్ ద్వారా మూడు రకాల క్యాన్సర్ లక్షణాలను గుర్తిస్తున్నాం. క్యాన్సర్‌ను ఆదిలో గుర్తిస్తే మెరుగైన వైద్యం అందించి సులభంగా నివారించవచ్చు. సర్వే ద్వారా ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నాం. క్యాన్సర్ ఉన్నట్టు చాలా మందికి తెలియక వ్యాధి తీవ్రంగా మారిన తర్వాత ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తించడమే సర్వే లక్ష్యం.

– డాక్టర్ డి.మహేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ, భీమవరం

**జిల్లాలో స్క్రీనింగ్ వివరాలు**

| | |
|---|---|
| కుటుంబాలు | 6.16 లక్షలు |
| పురుషులు, మహిళలు | 13.22 లక్షలు |
| **ఇప్పటివరకు పూర్తి** | |
| కుటుంబాలు | 5,413 |
| పురుషులు, మహిళలు | 15,304 |
| **సర్వే సిబ్బంది** | |
| వైద్యాధికారులు | 87 |
| ఏఎన్‌ఎంలు | 560 |
| ఆశావర్కర్లు | 1,391 |
| కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు | 365 |

## చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతూ సీఐడీ డీఎస్పీ శ్రీనివాసరావు

పోలవరం రూరల్: ఎస్సీ, ఎస్టీ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏపీ సీఐడీ రాజమండ్రి డీఎస్పీ వై.శ్రీనివాసరావు అన్నారు. పట్టిసం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం–1989పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న నేరాలు గురించి, వాటి నుంచి చట్టరీత్యా ఎలా రక్షణ లభిస్తుందో తెలుసుకోవాలన్నారు. కేసుల్లో అరెస్టులు జరిగినా ట్రయిల్ సమయంలో సాక్ష్యం సరిగా చెప్పకపోవడంతో శిక్షలు పడటం లేదన్నారు. ఎస్టీలకు చట్టరీత్యా రక్షణ, హక్కుల గురించి వివరించారు. తహసీల్దార్ ఆర్‌ఎస్ రాజు మాట్లా డుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం గురించి తెలియజేశారు. పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఉన్న ప్రత్యేక చట్టాల గురించి వివరించారు. ఎస్సీ, ఎస్టీ చట్టంపై ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు, అడ్వకేట్ ఎస్.ఆనందరావు, మొడియం శ్రీనివాస రావు, రాజశేఖర్‌బాబు సీఐ బాలసురేష్, ఎస్సై ఎస్‌ఎస్ పవన్‌కుమార్, సీఐడీ అధికారులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### లా విద్యార్థినిపై లైంగిక దాడి దారుణం



భీమవరంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

భీమవరం: విశాఖ లా కళాశాలలో విద్యార్థినిపై అత్యాచారానికి నిరసనగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భీమవరంలో గురువారం ఆందోళన చేపట్టారు. సంఘం జిల్లా కార్యదర్శి పాగాకు పూర్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో జూలై నుంచి ఇప్పటివరకు 98 మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగినా ఎవరినీ శిక్షించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి, అశ్లీల సాహిత్యాల వల్ల మహిళలపై దాడులు పెరిగిపోయాయన్నారు. చట్టాన్ని, న్యాయాన్ని కాపాడాల్సిన విద్యార్థులే తోటి విద్యార్థినిపై అత్యాచారం చేయడం దారుణమని వాపోయారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్.ఉదయ్‌కుమారి, ఎస్.జయప్రద, ఎ.నాగరత్నం, ఎం.సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు పితృవియోగం



భూపతిరాజు సూర్య నారాయణరాజు (ఫైల్)

భీమవరం: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తండ్రి సూర్యనారాయణరాజు (91) గురువారం మృతి చెందారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన్ను భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సూర్యనారాయణరాజుకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిగా పని చేసి పదవీ విరమణ చేశారు. సూర్యనారాయణ రాజు భౌతిక కాయాన్ని భీమవరానికి తరలించి శుక్రవారం ఉదయం నర్సయ్య అగ్రహారంలోని స్వగృహం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. మధ్యాహ్నం 1 గంటకు టూటౌన్‌లోని బలుసుమూడి మోక్షధామంలో అంత్యక్రియలు నిర్వహిస్తారని శ్రీనివాసవర్మ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

### సోషల్ మీడియా కార్యకర్త సతీష్‌పై కేసు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: జిల్లాలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి నేతల కేసులు, వేధింపులు ఆగడం లేదు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నిడమర్రు మండలం చానమిల్లికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త బౌతు సతీష్‌పై టీడీపీ నేతల ఫిర్యాదుతో భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా సతీష్ పోస్టులు పెట్టి అసత్య ప్రచారం చేస్తున్నాడంటూ టీడీపీ భీమడోలు మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కమ్మ పద్మావతి ఈనెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం సతీష్‌ను అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సతీష్ పోస్ట్ పెట్టినందుకుగాను కేసు పెట్టారు.

### వైఎస్సార్‌సీపీ ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షుడిగా విష్ణువర్ధన్



కైకలూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ముదిరాజ్ (ముత్రాసి) సామాజికవర్గ అధ్యక్షుడిగా ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం చిగురుకోటకు చెందిన కోమటి విష్ణువర్ధనరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి గురువారం ఆదేశాలు అందాయి. విష్ణువర్ధనరావు ఇప్పటివరకు పార్టీ ముదిరాజ్ సామాజిక జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. విష్ణువర్ధనరావు నియామకంపై ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

### 'నవోదయ' దరఖాస్తులకు గడువు పెంపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 9,11 తరగతుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈనెల 26 వరకు పొడిగించినట్టు డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. అలాగే దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఈనెల 27,28 తేదీల్లో అవకాశంలుంటుందని పేర్కొన్నారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి

**కలెక్టర్ నాగరాణి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): ఏ ఒక్కరూ అనారోగ్యం కారణంగా అప్పులపాలు కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వ వైద్యులు బాధ్యతాయుతంగా సేవలందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం స్థానిక త్యాగరాజు కల్యాణ మండపంలో వైద్యారోగ్యశాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ఆయా శాఖల పనితీరు, లక్ష్యాలను సమీక్షించారు. లక్ష్యాలు చేరుకోని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు పోషకాహారం అందిస్తే ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారని తద్వారా ఆరోగ్య సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెలా ఐదు డెలివరీలు ఉండాలని, అవుట్, ఇన్ పేషెంట్ల సంఖ్య పెంచాలన్నారు. మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారినీ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించి విద్యాబుద్ధులతో పాటు ఆటపాటలను నేర్పించాలన్నారు. ప్రభుత్వాస్పత్రులకు వచ్చే పేద రోగులను ఆప్యాయంగా పలకరించాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది స్థానికంగా నివాసం ఉంటూ సేవలందించడం ద్వారా నమ్మకం పెరుగుతుందన్నారు. డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, ఐసీడీఎస్ అధికారి బి.సుజాతా రాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి దేవ సుధాలక్ష్మి, జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి ఎం.గులాబ్ రాజకుమార్, ఎన్టీఆర్ వైద్య సేవల కో–ఆర్డినేటర్ ఎస్.కీర్తి కిరణ్, వైద్యాధికారులు, అంగన్‌వాడీ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# తవ్వేయ్.. తరలించేయ్

- యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు
- అనుమతులు లేని ర్యాంపులో కార్యకలాపాలు
- నడిపూడి ర్యాంపు వైపు కన్నెత్తి చూడని అధికారులు



సిద్ధాంతం ఏటిగట్టుపై బారులు తీరిన వాహనాలు



నడిపూడిలో కొనసాగుతున్న ఇసుక తవ్వకాలు

పెనుగొండ: నడిపూడి ర్యాంపులో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ర్యాంపు నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేకపోయినా మూడో రోజు గురువారం కూడా ఇసుక అమ్మకాలు సాగాయి. పగలు ర్యాంపులో మెషీన్లతో ఇసుకను మేటలు వేస్తూ, రాత్రిళ్లు అమ్మకాలు చేస్తున్నారు. అధికారులకు పైస్థాయిలో ఒత్తిళ్లు ఉండటంతో ఇటుగా కన్నెత్తి చూడటం లేదు. మూడు రోజులుగా 600 వాహనాలకు పైగా ఇసుకను విక్రయించినట్టు అంచనా. ఒక్కో యూనిట్ ఇసుకకు రూ.500 లోడింగ్, బాట చార్జీలు వసూలు చేస్తున్నారు. బాహాటంగా ఇసుక అక్రమంగా తవ్వుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు విస్తుపోతున్నారు.

**డిమాండ్‌తో భారీగా వాహనాలు**

జిల్లాలో ర్యాంపులకు అనుమతి లేకపోవడంతో ఇసుకకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో నడిపూడిలో అక్రమంగా ఇసుక తవ్వడంతో జిల్లా నలుమూలల నుంచి వందలాది వాహనాలు తరలివస్తున్నాయి. సిద్ధాంతం నుంచి నడిపూడి వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి. మరో వైపు జాతీయ రహదారి వరకూ నిలిచి ఉంటున్నాయి. ఇదిలా ఉండగా లోడింగ్‌కి తమకు అవకాశం ఇవ్వకపోవడంతో ఇసుక కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నడిపూడిలో సుబ్రహ్మణ్యేశ్వర ఇసుక కార్మికుల సంఘంలో 300 మంది కార్మికులు ఉన్నారు. వీరికి ఉపాధి కల్పించడంలో అడ్డుపడుతున్నారంటూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఇంతలా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా మైనింగ్, జిల్లా అధికారులు కదలకపోవడం విశేషం.

### దళారులను ఆశ్రయించొద్దు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డ్రైవింగ్ లైసెన్స్ కోసం దళారులను ఆశ్రయించవద్దని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎస్‌సీ సెంటర్లు, ఈ–సేవల ద్వారా నిర్ణీత రుసుం చెల్లించి రవాణా సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. వాహనాలకు వాహన్.పరివాహన్, డ్రైవింగ్ లైసెన్సులకు సారథి.పరివాహన్ వెబ్‌సైట్ల ద్వారా మొబైల్ ఫోన్, కంప్యూటర్లను వినియోగించుకుని ప్రజలు సేవలు పొందవచ్చని తెలిపారు. తమ కార్యాలయంలో పౌర సమాచార కేంద్రం ద్వారా సేవలు అందిస్తున్నామని, రవాణా సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురైతే సెల్ 91542 94210, 91542 94105 నంబర్లలో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తం



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శివకిశోర్

ఏలూరు టౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలను అరికట్టేందుకు బ్యాంకర్లు అవగాహనతో పోలీసులకు సహకారం అందించాలని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం బ్యాంకు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. బ్యాంకుల వద్ద భద్రతా చర్యలు, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లకు కొన్ని బ్యాంకులు పూర్తిగా సహాయ, సహకారాలు అందిస్తున్నట్టు పోలీస్ దర్యాప్తులో స్పష్టమైందన్నారు. బ్యాంకు ఖాతా తెరిచే సమయంలో పూర్తి సమాచారం తెలుసుకోవాలని సూచించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు అందించే వారి ఖాతాలపై నిఘా ఉంచాలన్నారు. ఖాతాదారుల లావాదేవీలపైనా పర్యవేక్షణ ఉండాలన్నారు. వృద్ధులు, నిరక్షరాస్యులకు బ్యాంకుల వద్ద లావాదేవీల సమయంలో బ్యాంకు సిబ్బంది సహకారం అందించాలని కోరారు. ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతా చర్యలు, సీసీ కెమెరాలను నిత్యం పరిశీలించాలన్నారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీలు డి.శ్రావణ్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, ప్రసాద్, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, సీఐలు పాల్గొన్నారు.

## హెచ్‌ఎం, వంట సిబ్బందిపై చర్యలు



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ అన్నమ్మ

దెందులూరు: దెందులూరు మండలంలోని జోగన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తిని 9 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవడానికి కారణమైన హెచ్‌ఎం, మధ్యాహ్న భోజన నిర్వాహకులపై చర్యలు తీసుకున్నామని డీఈఓ వెంకటలక్ష్మమ్మ, ఎంఈఓ కె.అన్నమ్మ తెలిపారు. నిబంధనలు పట్టించుకోని హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్ జారీ చేశామని, రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం పాఠశాలలో భోజనాన్ని స్వయంగా తాను రుచి చూసి నాణ్యతను పరిశీలించానని ఎంఈఓ అన్నమ్మ అన్నా రు. భోజనం చేసిన తర్వాత విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నామన్నారు. అనంతరం డీఈఓ, ఎంఈఓ ఏలూరులో చికిత్స పొందుతున్న పాఠశాల విద్యార్థులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అలాగే ఇంటి వద్ద చికిత్స పొందుతున్న విద్యార్థులను గురువారం తహసీల్దార్ బి.సుమతి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ప్రతి రెండు గంటలకో సారి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై తనకు రిపోర్ట్ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు.

# వరికి వాయుగండం

- వాతావరణ హెచ్చరికలతో రైతుల ఆందోళన
- ముమ్మరంగా ఖరీఫ్ మాసూళ్లు
- జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో సాగు



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట



మాసూళ్లు చేసిన ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టిన దృశ్యం

భీమవరం: వాతావరణం జిల్లా రైతులకు గుబులు పుట్టిస్తోంది. సార్వా వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో నైరుతి బంగాళాఖాతంలో ఈనెల 25న వాయుగుండం ఏర్పడనుందనే వాతావరణ శాఖ ప్రకటన కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఇప్పటికే ఆకాశం మేఘావృతమై చలిగాలుల తీవ్రత పెరగడంతో తుపాను ముప్పుతప్పేలా లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 20 మండలాల్లో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో సార్వా వరి నాట్లు వేశారు. సీజన్ ప్రారంభం నుంచి అధిక వర్షాలు, వరదల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలు చోట్ల నాట్లు దెబ్బతినడంతో రెండు, మూడుసార్లు తిరిగి నాట్లు వేయగా.. కొందరు పెట్టుబడి పెట్టలేక భూములను బీడులుగా వదిలివేశారు. ముందుగా దెబ్బతిన్న వరి నాట్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. తుపాను ప్రభావం దక్షిణ కోస్తా తీరంపై ఎక్కువగా ఉండే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలతో కోతకు సిద్ధంగా ఉన్న పంటను గట్టుకు చేర్చడానికి రైతులు శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 45 వేల ఎకరాల్లో మాత్రమే మాసూళ్లు పూర్తిచేయగా ఎక్కువ శాతం కోతకు సిద్ధంగా ఉంది.

**ఎండబెట్టడానికి ఇబ్బందులే..** రైతులు ఎక్కువగా కోత యంత్రాలతో మాసూళ్లు చేపట్టడంతో ధాన్యాన్ని ఎండబెట్టడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ధాన్యం ఎండబెట్టడానికి కళ్లాలు లేకపోవడంతో రోడ్లు వెంబడి, రియల్‌ఎస్టేట్ భూములను ఉపయోగించుకుంటున్నారు. ఇటువంటి తరుణంలో రెండు రోజులుగా ఎండ తీవ్రత సరిగా లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. కోత యంత్రాల ద్వారా మాసూళ్లు చేసిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల ధాన్యం విక్రయానికి ఎండబెట్టడం తప్పనిసరి. అయితే చలిగాలులు, కళ్లాలు లేకపోవడం వంటి సమస్యలతో ఎక్కువ రోజులు ఆరబెట్టాల్సి వస్తుందని, దీంతో ఖర్చు పెరుగుతుందని రైతులు అంటున్నారు. తుపాను ప్రభావంతో అధిక వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు.

### రైతులు అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో సార్వా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో బంగాళాఖాతంలో వాయుగుండంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. మాసూళ్లు చేసిన ధాన్యాన్ని చేలలో ఉంచకుండా గట్టుకు చేర్చుకోవాలి. అలాగే కూలీలతో మాసూళ్లు చేసే రైతులు వాయుగుండం ప్రభావం తగ్గే వరకూ కోతలను వాయిదా వేసుకోవడం మంచిది.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, భీమవరం

## క్లుప్తంగా

### ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి వైరు చోరీ



రాగి వైరు కోసం ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసిన దృశ్యం

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ గంగవరం గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైర్‌ను చోరీ చేశారు. దీనిపై కొయ్యలగూడెం విద్యుత్ సబ్ స్టేషన్, పోలీస్ స్టేషన్‌లో బాధిత రైతు బల్లె నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో సుమారు రూ.20 వేల విలువైన రాగి వైర్‌ను దొంగిలించారని అన్నారు. నెలరోజుల వ్యవధిలో ముగ్గురు రైతులకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం కాబడి అందులోని రాగి వైరు, సర్వీస్ వైరు దొంగతనానికి గురైందని మరో రైతు బల్లే పాపారావు తెలిపారు. ఓవైపు పంటలకు సమయానికి సాగునీరు అందకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### పోక్సో కేసులో యువకుడి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న నరసాపురం డీఎస్పీ శ్రీవేద

నరసాపురం: పోక్సో కేసులో ఓ యువకుడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. నరసాపురంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ డి.శ్రీవేద నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన చింతా నర్సింహస్వామి (బాబీ) నరసాపురం రూరల్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌ను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. అలాగే పలువురు యువతులను ప్రేమ పేరుతో ఏమార్చి వారివద్ద నుంచి నగదు, బంగారం తీసుకుని జల్సాలు చేస్తుంటాడని ఫిర్యాదులున్నాయి. దీంతో అతడిపై నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. గురువారం నిందితుడు బాబీని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా కోర్టు 14 రోజుల రిమాండ్‌ను విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

### లారీ ఢీకొని వృద్ధురాలు మృతి



నాగమ్మ మృతదేహం

చింతలపూడి: లారీ ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన చింతలపూడి మండలం యర్రగుంటపల్లిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన మానికల నాగమ్మ (65) చర్చి సమీపంలో కాలనీలో రోడ్డు దాటుతుండగా సీతానగరం వెళుతున్న పామాయిల్ లారీ ఢీకొంది. ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఎస్సై కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పని బారెడు.. వేతనం మూరెడు

- అంగన్‌వాడీ మెయిన్, మినీ వర్కర్లకు ఒకే తరహాలో పని భారం
- వేతనాల్లోనే వ్యత్యాసం చూపుతున్నారంటూ మినీ వర్కర్ల గగ్గోలు
- మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్

ఏలూరు (టూటౌన్) : అంగన్‌వాడీ మినీ వర్కర్ల పరిస్థితి పని బారెడు.. వేతనం మూరెడు అన్న చందంగా ఉంది. వాస్తవానికి ప్రారంభంలో వీరిని కేవలం మినీ సెంటర్లలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆహారం అందిస్తే చాలని నియమించారు. కానీ మెయిన్ సెంటర్లలోని వర్కర్లు, ఆయాలు ఇద్దరూ కలిసి చేసే పని అంతటిని వీరితోనే చేయిస్తున్నారు. ప్రీ స్కూలు నడపడం, వంట చేయడం, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వర్కులు, రికార్డులు రాయడం వంటి అన్ని పనులను ఒక్క మినీ వర్కర్ తోనే చేయిస్తున్నారు. మెయిన్ సెంటర్లలో వర్కర్లకు నెలకు రూ.11,500, ఆయాలకు రూ.7000 వేతనంగా చెల్లిస్తున్నా.. మినీ వర్కర్ల చేత మాత్రం ఇంత పనిచేయించుకుంటూ రూ.7000 మాత్రమే ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకోవడంపై వారు గగ్గోలు పెడుతున్నారు.





మినీ అంగన్‌వాడీ కేంద్రం

**300 లోపు జనాభా ఉంటేనే..**

నిబంధనల ప్రకారం మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీల్లో 300 లోపు జనాభా ఉంటే ఒక మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేయాల్సి ఉంది. అయితే దానికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం 300 నుంచి 1200 వరకు జనాభా ఉన్నా సరే మినీ సెంటర్ తోనే నెట్టుకొచ్చేస్తున్నాయి. ఏలూరు జిల్లాలో 206, పశ్చిమగోదావరి జిల్లాలో 70 కలిపి మొత్తం ఉమ్మడి జిల్లాలో 276 అంగన్‌వాడీ మినీ కేంద్రాలు ఉన్నాయి. ఒకటి రెండు చోట్ల మినహా అన్ని చోట్లా నిబంధనలకు మించి లబ్ధిదారులు ఉన్నారు.

**కేంద్రం అనుమతి ఇచ్చినా చలనం లేదు**

అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాల్సిందిగా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. పంజాబ్, మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో మినీ సెంటర్‌లను మార్పుచేశారు. కానీ మన రాష్ట్రంలో ప్రభుత్వం మాత్రం దీనిపై స్పందించడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జీవో విడుదల చేయాలంటూ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని అంగన్‌వాడీ మినీ వర్కర్లు ఆందోళన బాట పట్టారు. ఇటీవల జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు కూడా నిర్వహించారు.





ఏలూరు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ మినీ వర్కర్ల ధర్నా (ఫైల్)

### తక్షణం జీవో ఇవ్వాలి



మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జీవో ఇవ్వాలి. మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు, ఇతర బెనిఫిట్స్ అందజేయాలి. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం అమలుచేయాలి.

– కె.విజయలక్ష్మి, గౌరవ అధ్యక్షురాలు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఏలూరు జిల్లా కమిటీ

### సమాన వేతనం చెల్లించాలి



సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. మెయిన్ సెంటర్లలోనూ, మినీ సెంటర్లలోనూ చేసే పని ఒక్కటే అయినా వేతనాల్లో వ్యత్యాసం చూపుతున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తకు అందించే వేతనాన్నే మినీ కేంద్రాల్లో పనిచేసే వారికి అందించాలి. మాకూ సహాయకులను ఇవ్వాలి.

– టి.మరియమ్మ, అంగన్‌వాడీ మినీ వర్కర్, భోగోలు, లింగపాలెం మండలం

### వేసవి సెలవులు ఇవ్వాలి



అంగన్‌వాడీ మినీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలి. కనీసం సెలవులు లేకుండా పనిచేయాలంటే కష్టంగానే ఉంది. సర్వీస్‌లో ఉండి చనిపోయిన వారికి మట్టి ఖర్చుల జీవోను వెంటనే అమలు చేయాలి. పనిభారం తగ్గించాలి.

– చిలక భారతి, అంగన్‌వాడీ మినీ వర్కర్, శ్రీరామవరం, దెందులూరు మండలం

### సూపర్‌వైజర్ పోస్టులకు అవకాశం కల్పించాలి



అంగన్‌వాడీ మెయిన్ కేంద్రాల్లోని వర్కర్లకు అవకాశం ఇచ్చిన విధంగా గ్రేడ్–2 సూపర్‌వైజర్ పోస్టులకు మినీ వర్కర్లకు కూడా అవకాశం కల్పించాలి. గతంలో 42 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలతో కూడిన మినిట్స్ కాపీని అమలు చేయాలి.

– జి.సరళాదేవి, అంగన్‌వాడీ మినీ వర్కర్, చార్లెస్ నగర్, చింతలపూడి

### 24న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

తణుకు అర్బన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన జిల్లా సీనియర్ కబడ్డీ పురుషులు, మహిళల జట్ల ఎంపిక తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ అధ్యక్షుడు కౌరు శ్రీనివాస్, కార్యదర్శి వై.శ్రీకాంత్ తెలిపారు. ఎంపికైన జట్లు ఒంగోలులోని సంతనూతలపాడులో నిర్వహించనున్న 71వ సీనియర్ కబడ్డీ స్టేట్ మీట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని వివరించారు. వివరాలకు 96424 96117, 94913 33906 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### 24న బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 24వ తేదీన మార్టేరులోని ఎస్‌వీజీ జెడ్పీ హైస్కూల్‌లో బాస్కెట్‌బాల్ సీనియర్ పురుషుల జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కె కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 6 నుంచి 9 వరకూ మార్టేరులో జరిగే రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో పాల్గొంటారని వివరించారు. వివరాలకు 94411 71933, 94403 49534 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### 28న కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 28వ తేదీన ఏలూరులో కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించే ఈ పోటీల్లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన కిడ్స్, బాలబాలికలు పాల్గొనవచ్చని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అధ్యక్షుడు జల్లా వీరభద్రరావు పేరుతో నిర్వహించే ఈ పోటీల్లో 8 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు వయసు గల అథ్లెట్లు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 62814 31202 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# క్షీరారామంలో నగల పరిశీలన

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీక్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బంగారం, వెండి వస్తువులను దేవదాయ ధర్మాధాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ (జేవిఓ) విల్లా పళ్లంరాజు గురువారం పరిశీలించారు. అనంతరం వీటిని ఆలయ నూతన ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావుకు అప్పగించారు. ఈ సందర్భంగా పళ్లంరాజు మాట్లాడుతూ రెండు నెలల క్రితం ఇక్కడి ఈవో యాళ్ల సూర్యనారాయణ బదిలీ అయ్యారని ఆయన స్థానంలో ముచ్చర్ల శ్రీనివాసరావు నియమితులయ్యారని తెలిపారు. గతంలో పరిపాలనా విభాగానికి సంబంధించిన విషయాలను అప్పగించడం జరిగిందని, స్వామివారి బంగారం, వెండి వస్తువులు మాత్రం నేడు పరిశీలించి ప్రస్తుత ఈవో శ్రీనివాసరావుకు అప్పగించడం జరిగిందన్నారు. మూడేళ్లకు ఒకసారి నగల తనిఖీ నిర్వహిస్తామని, చివరిగా 2022లో పరిశీలించామని, మళ్లీ 2025లో నగలు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలనలో భాగంగా కింద పరిచిన వెండి వస్తువులు

# ఆటోను ఢీకొన్న వ్యాన్.. ఐదుగురికి గాయాలు

కైకలూరు: ఆటోను వ్యాన్ ఢీకొనడంతో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన కైకలూరు మండలం ఆచవరం చల్లాలమ్మ గుడి సమీపంలో గురువారం జరిగింది. కైకలూరు టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ నుంచి వ్యాన్‌లో డ్రైవర్ మల్లిఖార్జునరావు రొయ్యల సీడ్(పిల్లలు) లోడు తీసుకుని కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో కైకలూరు మండలం శ్యామలాంబపురం గ్రామానికి చెందిన ఆటోలో వతాని నరసింహస్వామి, భార్య నాగలక్ష్మి, గ్రామస్తులు మైలు శ్రీరాములు, వల్లబోని రాంబాబు, బసవని అయ్యప్ప చేపల పట్టుబడి నిమిత్తం కలవపూడి వెళుతున్నారు. ఆచవరం చల్లాలమ్మ గుడి సమీపం వద్దకు వచ్చేసరికి ఆటోను వ్యాన్ ఢీకొనడంతో వ్యాన్ బోదెలో పడగా ఆటో మూడు పల్టీలు కొట్టింది. వ్యాన్‌లోని రొయ్యల సీడ్ నేలపాలుకాగా ఆటోలో ప్రయాణిస్తున్న అందరికీ గాయాలయ్యాయి. ప్రమాదంలో మైలు శ్రీరాములు(25) తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రులను కైకలూరు ప్రభుత్వాసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు జిల్లా అస్పత్రికి తరలించారు. ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు. క్షతగాత్రుడు శ్రీరాములు ఫిర్యాదుపై టౌన్ ఏఎస్సై మల్లిఖార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కైకలూరు మండలం ఆచవరం వద్ద బోల్తా పడిన రొయ్యల సీడ్ వ్యాన్

# దారిదోపిడీ దొంగల అరెస్ట్

- ఇద్దరు దొంగలను పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్ : దారిదోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను ద్వారకాతిరుమల మండలం కప్పలగుంటలో బుధవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కొంతమూరు జంగాలకాలనీకి చెందిన మానిపాటి విజయ్‌కుమార్, రాజమహేంద్రవరంలోని చింతల నామవరం ప్రాంతానికి చెందిన దామిరెడ్డి త్రిమూర్తులుగా గుర్తించారు. వీరినుంచి రూ.5 వేల నగదు, ఒక బంగారపు ఉంగరం, టార్చ్‌లైట్, నిందితులు వినియోగించే పాసింజర్ ఆటో ఏపీ39 యూక్యూ 2652ను సీజ్ చేశారు. నిందితులను గురువారం కోర్టులో హాజరుపర్చారు. ఈ దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన భీమడోలు సీఐ యూజే విల్సన్, ఎస్సై సుధీర్, భీమడోలు హెచ్‌సీ ఎస్.శ్రీనివాసరావు, ద్వారకాతిరుమల కానిస్టేబుల్ ఎంఎన్‌డీ ప్రసాద్, హెచ్‌జీ వీజే ప్రకాష్‌బాబును ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. దారిదోపిడి ఘటనలను ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ వెల్లడించారు.

**దారి దోపిడీ ఘటనలు ఇలా ఉన్నాయి.**

- మానిపాటి విజయ్‌కుమార్ రెండేళ్ల క్రితం తన స్నేహితులు సాల వెంకన్న, అతని భార్య ముంతాజ్, ధవళేశ్వరానికి చెందిన రవి, సానిటోరియంకు చెందిన మానస (హిజ్రా) గోకవరం బస్టాండ్ ప్రాంతానికి చెందిన కారు డ్రైవర్ సంజీవ్ అనే ఆరుగురు వ్యక్తులు దారిదోపిడీలకు పాల్పడడం ప్రారంభించారు. కారును అద్దెకు తీసుకుని విజయవాడ వైపు వెళుతూ ఏలూరు జిల్లా దెందులూరు మండలం గుండుగొలను బస్టాండ్ సమీపంలో కారు రోడ్డు పక్కగా పార్కింగ్‌చేసి ఉండటాన్ని గమనించారు. కారు డ్రైవర్ సీట్ వైపు అద్దం కిందకు దింపి ఉండడంతో డ్రింక్ తాగేందుకు ఆపినట్లు నిందితులు కారు ఆపి వేరొక కారులోని సీటులో ఉన్న పర్సులో బంగారు చైను, బంగారపు ఉంగరాన్ని, రూ.5 వేల నగదును కాజేశారు.
- జగ్గంపేట దగ్గరలోని ఎర్రవరం ప్రాంతంలో నాలుగేళ్ల క్రితం విజయ్‌కుమార్, సాలా బలరాం ఇద్దరూ కలిసి రాత్రి సమయంలో జాతీయ రహదారిపై టార్చ్‌లైట్ వేస్తూ వారివద్దకు వచ్చిన వ్యక్తిని కొట్టి అతని వద్ద రెండు బంగారు ఉంగరాలు లాక్కున్నారు.
- మూడేళ్ల క్రితం సిద్ధాంతం ఇటుకల బట్టీ రోడ్డు పక్కన ఒక వ్యక్తి మద్యం మత్తులో తన మోటారు సైకిల్‌పై ఉండగా విజయ్‌కుమార్, సాల వెంకన్న, అతని భార్య ముంతాజ్, రవి, మానస (హిజ్రా), సంజీవ్ కలిసి అతడ్ని కొట్టి 3 బంగారు ఉంగరాలు బలవంతంగా లాక్కున్నారు.
- రాజానగరం దాటిన అనంతరం మల్లేపల్లి సమీపంలో పామాయిల్ తోటల వద్ద చేప పిల్లల వ్యాను డ్రైవర్‌ను కొట్టి అతని మెడలోని బంగారు చైను లాక్కుని పారిపోయారు.
- దేవరపల్లి మండలం చిన్నాయగూడెం గ్రామానికి చెందిన ఆలూరి చిన్న వెంకటేశ్వరరావు అక్టోబర్ 25న మోటారు సైకిల్‌పై భీమడోలు వస్తున్నాడు. ద్వారకాతిరుమల మండలం కప్పలగుంట గ్రామంలో జాతీయ రహదారిలో ఒక కల్వర్టు వద్ద మోటారు సైకిల్‌ను ఆపగా అప్పటికే పొలంలో దాగి ఉన్న ఇద్దరు వ్యక్తులు వెంకటేశ్వరరావుపై ఆకస్మికంగా దాడి చేశారు. రూ.10 వేల నగదు, సెల్‌ఫోన్, బంగారు ఉంగరాన్ని బలవంతంగా లాక్కున్నారు. వెంకటేశ్వరరావు కాళ్లు, చేతులు కట్టివేసి చెట్ల పొదల్లో పడేసి పారిపోయారు. ఈ ఘటనపై బాధితుడు ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై టి.సుధీర్ కేసు నమోదు చేశారు. ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ యూజే విల్సన్ ఆధ్వర్యంలో ఎస్సై సుధీర్, సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. దారి దోపిడీకి పాల్పడిన విజయ్‌కుమార్, త్రిమూర్తులను సాంకేతిక పరిజ్ఞానంతో ద్వారకాతిరుమల మండలంలోని కప్పలగుంటలో పోలీసులు అరెస్ట్ చేశారు.





కేసు వివరాలు తెలుపుతున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, చిత్రంలో సీఐ విల్సన్



### వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



జాతీయరహదారిపై వృద్ధుడి మృతదేహం



దెందులూరు రజకుల చెరువు వద్ద బ్రహ్మానంద మృతదేహం

దెందులూరు: వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాలివి. జాతీయ రహదారిపై శింగవరం నాగహనుమాన్ ఫ్యాక్టరీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గూటాలకు చెందిన కోరాడ సుబ్బారావు(60) గురువారం మృతి చెందాడు. అలాగే దెందులూరులో రజకుల చెరువు వద్ద ట్రాక్టర్‌ను నడుపుతున్న బ్రహ్మానంద పుడవర్తి (24) ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో మృతి చెందాడు. ఊడ్పులు, కూలీ పనుల కోసం అతడు మహారాష్ట్ర నుంచి ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ప్రమాద ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివాజీ చెప్పారు.

### అక్రమంగా మట్టి తవ్వకాలు

కామవరపుకోట: మండలంలో అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉప్పలపాడు గ్రామ పంచాయతీ శివారు సమీపంలోని ఓ చెరువులో ఏ విధమైన అనుమతులు లేకుండానే మట్టిని తరలించేస్తున్నారు. రాత్రిపూట టిప్పర్లతో ఇష్టానుసారంగా మట్టిని తవ్వి స్థానిక కొత్తూరులోని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై గ్రామస్తులు జేసీబీ యజమానులను నిలదీయగా ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని సమాధానం చెబుతున్నారు. స్థానికులు గ్రామ రెవెన్యూ అధికారికి ఈవిషయంపై ఫిర్యాదు చేయగా సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపాడు.



ఉప్పలపాడు శివారు చెరువులోని మట్టిని జేసీబీలతో టిప్పర్లలోకి నింపుతున్న దృశ్యం

# పిట్ట కొంచెం.. కూత ఘనం

కాళ్ల: మూడేళ్ల వయసులోనే దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల పేర్లు ఇంగ్లీషులో చెప్పడంతో పాటు, మానవ శరీరంలోని అన్ని అవయవాల పేర్లను ఇంగ్లీషులో సంబోధిస్తూ అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది కాళ్ళ మండలం దొడ్డనపూడి గ్రామానికి చెందిన కొల్లి జస్వికశ్రీజ. చిన్నారి ప్రతిభా పాటవాలను గుర్తించిన తల్లిదండ్రులు మరింత ప్రోత్సాహం ఇవ్వడంతో సుమారు 500 పదాలు ఇంగ్లీషులో టకటకా చెప్పేస్తుంది. జస్వికశ్రీజ తల్లిదండ్రులు కొల్లి శివసత్యనారాయణ, నవ్యశ్రీ చిన్నారి వీడియోలను అక్టోబర్ 2వ తేదీన ఇండియా బుక్ ఆఫ్ రికార్డు బృందానికి పంపగా అక్టోబర్ 20 తేదీన ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో సెలెక్ట్ అయినట్లు ప్రకటించారు. హర్యానా రాష్ట్రం వచ్చి మెడల్ అందుకోవాలని చెప్పగా తమ ఆర్థిక పరిస్థితి వివరించడంతో వారు కొరియర్ ద్వారా చిన్నారి శ్రీజ ఇంటికి మెడల్, సర్టిఫికెట్, ఐడీ కార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డు పుస్తకం, బ్యాడ్జ్, పెన్, స్టికర్లు పంపించారు. వీటిని గురువారం కలెక్టర్ సీహెచ్ నాగరాణి చేతుల మీదుగా అందుకున్నారు. కొల్లి శివసత్యనారాయణ, నవ్యశ్రీ దంపతులకు జస్వికశ్రీజ చిన్న కుమార్తె కాగా పెద్ద అమ్మాయి విద్యాశ్రీవల్లి ఎల్‌కేజీ చదువుతోంది.





ధ్రువీకరణ పత్రాలతో చిన్నారి జస్వికశ్రీజ

# వైభవంగా జ్యోతి ఊరేగింపు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి మాలధారణ భక్తులు గురువారం జ్యోతి ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణంలో పురవీధుల్లో అమ్మవారి జ్యోతి ఊరేగింపు సాగింది. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ దీక్షాపరులచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, సిబ్బంది ఊరేగింపులో పాల్గొన్నారు.



జ్యోతి ఊరేగింపు నిర్వహిస్తున్న మావుళ్లమ్మ మాలధారణ భక్తులు

### భారీ పేకాట స్థావరంపై దాడి



జూదరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ద్వారకాతిరుమల: రాజుపాలెంలో ఒక భారీ పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 5 గురిని అరెస్ట్ చేసి, పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై టి.సుధీర్ తెలిపిన కథనం ప్రకారం.. రాజుపాలెం గ్రామంలోని ఒక ఆయిల్‌పామ్ తోటలో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం అందుకున్న భీమడోలు సీఐ యుజే విల్సన్, ద్వారకాతిరుమల, భీమడోలు ఎస్సైలు టి.సుధీర్, సుధాకర్ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏలూరు సమీపంలోని సత్రంపాడుకు చెందిన శొటియాల బాలాజి, దెందులూరుకు చెందిన కోటాకల ఫణికుమార్, సువ్వాడ సత్యన్నారాయణ, విజయవాడకు చెందిన మణికొండ ఏడుకొండలు, ఏలూరు తూర్పువీధికి చెందిన గుత్తా వెంకటేశ్వరరావులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3,60,500 నగదు, ఒక కారు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుధీర్ తెలిపారు.

## క్లుప్తంగా

### అఖండ అన్నసమారాధన



అత్తిలి నాగమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

**అత్తిలి:** నాగుల చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లోగల నాగమ్మ ఆలయంవద్ద గురువారం అఖండ అన్న సమారాధన జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా నాగమ్మ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

### బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు



బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్దనుంచి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కేఎస్‌వీ.కల్యాణ్ చక్రవర్తి గురువారం తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నట్లుతెలిపారు.

### మరుగుదొడ్ల వాడకం సామాజిక బాధ్యత



ఎల్.అగ్రహారం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం రూరల్:** మరుగుదొడ్ల వాడకం అందరి సామాజిక బాధ్యత అని ఆర్‌డబ్ల్యూఎస్ రాజా శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని ఎల్. అగ్రహారం గ్రామంలో వరల్డ్ టాయ్‌లెట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇళ్లలో మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, బహిరంగ మల, మూత్ర విసర్జన విడనాడాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి శ్రీరామ్, హైస్కూల్ హెచ్‌ఎం స్వామి, ఎంఆర్‌సీఎం రవికిరణ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



మంచిలిలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న కారంకి ఫౌండేషన్ సభ్యులు

**తణుకు అర్బన్:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన ఉడతల యమునా శ్రీలక్ష్మికి హైదరాబాద్‌కు చెందిన కారంకి ఫౌండేషన్ ఆర్థికసాయం అందజేసినట్లు ఫౌండేషన్ సభ్యుడు వీరమల్లు ఫణీంద్రకుమార్ తెలిపారు. ఫౌండేషన్ నాయకులు కారంకి వెంకట శివనారాయణ పంపిన రూ. 60,602 చెక్కుతో పాటు సుబ్రహ్మణ్యం అందజేసిన రూ. వెయ్యితోకలిపి మొత్తం రూ. 61,602 బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. జైఆంధ్ర గౌడ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ నంగెడ్ల రంగారావు, జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం గౌడ్, తణుకు గౌడ సంఘ సభ్యులు కట్టా రాజేష్ పాల్గొన్నారు.

### డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన



డయల్ యువర్ డీఎంలో పాల్గొన్న మూర్తి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** ఆర్టీసీ డయల్ యువర్ డీఎంకు ప్రజల నుంచి స్పందన లభించింది. గురువారం ఆర్టీసీ డీఎం కార్యాలయంలో డయల్ యువర్ డీఎంకు పలు ఫిర్యాదులు ఫోన్ ద్వారా అందాయి. సూచనలు, సలహాలు అందజేశారు. ఆచంట వద్ద వేమవరం గ్రామం వరకు బస్సు పొడిగించమని, జువ్వలపాలెం వద్ద ఉదయం 8 గంటల నుంచి 9 గంటల మధ్యలో బస్సులు ఆపడం లేదని, తాళ్ళముదునూరుపాడు వద్ద బస్సు స్టాప్ కావాలని, తణుకు నుంచి తాడేపల్లిగూడెంనకు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో బస్సు కావాలని కోరారు. కార్తీక మాసం పంచారామాలు బస్సులు వివరాలు అడిగారని డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. సూచనలు, సలహాలు, ఫిర్యాదులను పరిష్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# వరి రైతు వర్రీ

- ఊపందుకున్న వరి కోతలు
- వరద ముంపుతో తగ్గిన దిగుబడులు
- రైతులను పూర్తిగా విస్మరించిన కూటమి సర్కార్



రోడ్డుపై ఎండబెట్టిన ధాన్యం



ముద్దాపురంలో యంత్రం ద్వారా వరి పంటను మసూలు చేస్తున్న దృశ్యం

**తణుకు టౌన్:** ఆరు గాలం శ్రమించిన రైతన్న వరి స్థితులు అనుకూలించక ఆశించిన దిగుబడులు పొందలేకపోతున్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించక పోవడంతో నష్టాలు మూటకట్టుకుంటున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే మండలంలో అధికంగా వర్షాలు కురవడంతో రైతులు వరి అధికంగా సాగు చేశారు. అయితే ఆ తరువాత అధిక వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం మండలంలో వరికోతలు ఊపందుకోగా.. దిగుబడి భారీగా తగ్గిపోయింది. మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి సాగుపై మొగ్గుచూపారు. దీంతో మండలంలో దాదాపు 10వేల ఎకరాల్లో వరి సాగైందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే అధిక వర్షాలతో పాటు తెగుళ్ల బెడదతో వరి పైర్లు దెబ్బతిన్నాయి. దీంతో ఎకరానికి 25 నుంచి 30బస్తాలు మాత్రమే దిగుబడులు వస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. గతేడాదిలో 40నుంచి 45బస్తాల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం మండలంలోని కోనాల, ముద్దాపురం, తేతలి, మండపాక గ్రామాల్లోని దువ్వ తదితర గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. కూలీల భారంతో రైతులు కోత మిషన్ల ద్వారా వరి కోతలను ప్రారంభించారు.

**తగ్గిన ధర**

వరికి మద్దతు ధర లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతేడేది వరి క్వింటారు.2,700 నుంచి రూ.3,300 వరకు విక్రయించిన్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలో గిట్టుబాటు ధర లేక క్వింటా రూ.2000నుంచి రూ.2,200 మాత్రమే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వరికి గిట్టుబాటు ధర కల్పించి రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

**అందని పరిహారం..**

ఖరీఫ్ పంట కాలం పూర్తి కావస్తున్నా జూలై నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ ఇంకా అందలేదని రైతులు పేర్కొంటున్నారు. రెండవ సారి వరినాట్లు వేసే సమయంలోనే వారం రోజుల్లో రైతుల ఖాతాల్లోకి పంట నష్టం తాలూకా పరిహారం సొమ్ములు జమ చేస్తామని చెప్పిన నాటి వరినాట్లు పంట పూర్తైనా ఇప్పటికీ పరిహారం అందలేదని రైతులు పేర్కొంటున్నారు.

#### గిట్టుబాటు ధర కల్పించాలి



జూలైలో నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఎర్ర కాలువ వరదకు కాలువ పక్కన పొలాలు మునిగిపోయి నష్టపోవడంతో రెండవ సారి నాట్లు వేసాం. దీని వలన పంటకు పెట్టుబడి ఖర్చులు పెరిగినా దిగుబడులు తగ్గిపోయాయి. గతంలో ఇదే పొలాలు ఎకరానికి 30 నుంచి 40 బస్తాలు పండినా ఇప్పుడు మాత్రం ముంపు కారణంగా 20 నుంచి 25 బస్తాలే దిగుబడి వస్తున్నాయి. పంట ఖర్చులు పెరిగినా దిగుబడులు మాత్రం పెరగలేదు. దీనికి తోడు ప్రభుత్వం పంట నష్టానికి అందించే పరిహారం కూడా ఇంకా అందలేదు.

– పాకా శ్రీను, కౌలు రైతు, ముద్దాపురం

#### దిగుబడి తగ్గలేదు..

మండలంలో ఖరీఫ్ పంట దిగుబడి 30 నుంచి 40 బస్తాలు వచ్చింది. వ్యవసాయ శాఖ ర్యాండమ్ శ్యాంపిల్స్ ద్వారా తెలిసింది. ముంపు ప్రాంతాల్లో త్వరగా కోతకు వచ్చే విధంగా పీఆర్ 126 రకం వరిని సాగు చేశారు. రెండో పంటకు వీలుగా ఈ రకాన్ని సాగు చేశారు.

– కె కుసుమ, ఏఓ, తణుకు.

### కనకదుర్గమ్మ సారెకు పోటెత్తిన మహిళలు



తణుకులో కనక దుర్గమ్మ సారె ప్రసాదాన్ని అందుకుంటున్న మహిళలు

**తణుకు అర్బన్:** కార్తీకమాసం సందర్భంగా గురువారం తణుకులో నిర్వహించిన కనకదుర్గమ్మ వారి సారె ప్రసాదానికి మహిళలు భారీఎత్తున క్యూకట్టారు. హెడ్‌పోస్టాఫీసు సమీపంలోని కోదండ రామాలయంలో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారికి ఓంశక్తి పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారుగా వెయ్యి బిందెలతో భక్తులు సారె రూపంలో వివిధరకాల మిఠాయిలు, పసుపు, కుంకుమ, గాజులు, అరటిపండ్ల గెలలు స్థానిక మహిళలు ఈనెల 20వ తేదీన సమర్పించారు. ప్రతి ఏటా నిర్వహించే విధంగా ఆలయంలో ఒకరోజు నిద్ర అనంతరం గురువారం భక్తులకు సారె ప్రసాదాన్ని అందజేశారు. భారీ సంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంతం నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు కిటకిటలాడింది. ప్రసాదం కోసం వచ్చిన మహిళలకు ఓంశక్తి పీఠం మహిళలు ప్రత్యేకంగా నుదుటిన బొట్టుపెట్టి ప్రసాదాన్ని పంపిణీ చేయడం విశేషం. సుమారుగా 8 వేలకుపైగా మహిళలు హాజరై ప్రసాదాన్ని స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## చదరంగం పోటీల్లో సత్తా చాటాలి



విజేతలకు బహుమతి ప్రధానం చేస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** స్టేట్ అండర్ 13 ఓపెన్ అండ్ గర్ల్స్ చదరంగం పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి చదరంగం పోటీలలో సత్తా చాటాలని ఆంధ్ర చెస్ అసోసియేషన్ చైర్మన్ కేవీ శర్మ, రాష్ట్ర కార్యదర్శి కె.జగదీష్, వైస్ చైర్మన్ సీహెచ్‌ఏఆర్‌కే వర్మ, స్పాన్సర్ సింగం సుబ్బారావులు క్రీడాకారులకు సూచించారు. పట్టణంలోని గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో మూడోరోజు గురువారం చదరంగం పోటీలు నిర్వహించారు. టోర్నమెంట్ డైరెక్టర్ ఎస్.ఎస్.చంద్రశేఖర్ విజేతల వివరాలను ప్రకటించారు. ఓపెన్ విభాగంలో ప్రథమ స్థానం కొల్లా భవన్ (ఎన్‌టీఆర్), ద్వితీయ స్థానం హేమల్ వర్షన్ (నెల్లూరు), గర్ల్స్ విభాగంలో గొర్లి నైనా (విశాఖపట్నం), ద్వితీయ అమృత గుంతక (ప్రకాశం), అండర్ సెవెన్‌లో ప్రథమ స్థానం ఏ.శశాంక్ (తాడేపల్లిగూడెం), ద్వితీయ స్థానం వేదాంత్ మౌర్య (కోనసీమ) అండర్ నైన్ విభాగంలో వెలగోటి రెడ్డి (కృష్ణ), ద్వితీయ స్థానం పి.జోగేందర్, ఇతర విజేతలు వై.యాసిల్, పి.జోగేందర్, సత్తి రిత్విక్ రెడ్డి, జి.సమిత కోమల్, నిఖిల్, జయశ్రీలు విజేతలుగా నిలిచారు. ఛీఫ్ ఆర్బిటర్ ఫణికుమార్, రామ సుబ్బారెడ్డి, కె.ధనలక్ష్మిలు విజేతలను అభినందించారు. విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.

## ఉమాసిద్ధేశ్వరునికి ప్రత్యేక పూజలు



లక్ష బిల్వార్చన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**అత్తిలి:** కార్తీకమాసం సందర్భంగా అత్తిలిలో ఉమా సిద్ధేశ్వరస్వామి ఆలయంలో గురువారం లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, మండపారాధన, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, మహాలింగార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన, సుందరకాండ పారాయణం, రుద్ర హోమం, పూర్ణాహుతి, కార్యక్రమాలు నిర్వహించారు. కొరిపల్లి హరి, ఫణికుమారి దంపతులచే శాంతి కల్యాణం జరిపారు. ఆలయ అర్చకులు అయిలూరి రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండి అంజన్న, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యసాయి జన్మదినోత్సవం



సత్యసాయి మందిరంలో సామూహిక సీమంతాలు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలో సత్యసాయి జన్మదినోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని డీఎస్ చెరువు వద్ద శ్రీ సత్యసాయి సేవా సమితి మందిరంలో కన్వీనర్ ఎంఎస్ఎస్‌కే జనార్ధనరావు నేతృత్వంలో గురువారం ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. కొట్టు నాగ భూషణం, పుష్పవల్లి దంపతులచే 15 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. సత్యసాయి విద్యార్థినీ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సవీన్‌బాబా, ప్రవా శ్రీనివాస్, వెజ్జు ప్రసాద్, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న వడ్డి రఘురామ్ నాయుడు

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని కడియద్ద చెరువు గట్టున కోటి రూపాయల వ్యయంతో పునఃనిర్మించిన శ్రీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి హోమాలు, పూర్ణాహుతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత గోమాత దర్శనం, తదుపరి భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. గ్రామ సర్పంచ్ యాతం కోటేశ్వరి, ఎంపీటీసీ దుర్గాదేవి పర్యవేక్షణలో ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడు, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు తదితరులు దర్శించుకున్నారు. కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. వడ్డి రఘురామ్‌నాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతం సుభీక్షంగా ఉండాలని కోరారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్న సమారాధన కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దారపురెడ్డి శ్రీనివాస్, యాతం వెంకటరమణ, పరిమి భూపయ్య, కంతమణి సత్యనారాయణ, కల్లేపల్లి కృష్ణంరాజు, బొద్దాని శ్రీనివాస్, కొలుకులూరి ధర్మరాజు, కొండుబోయిన కృపావరం, ఆలయ కమిటి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం రాత్రి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు.

### ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేయాలి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** రాష్ట్ర వ్యాప్తంగా గత 2 సంవత్సరాల నుంచి వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న డీఎస్సీ 98 ఎంటీఎస్ కాంట్రాక్టు టీచర్లు సుమారు 3 వేల మంది ఉన్నారని, వారిని రెగ్యులర్ చేయాలని సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు వై.సుబ్బారాయుడు (పాలకొల్లు), కె.మోహన్‌రావు (తాడేపల్లిగూడెం)లు విజ్ఞప్తి చేశారు. గురువారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం, మంగళగిరిలోని పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయం, వివిధ రాష్ట్ర స్థాయి నాయకులను, అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.

### మోటారు సైకిల్ ఢీకొని ముగ్గురికి గాయాలు

**భీమవరం:** స్కూల్ నుంచి తన కుమారుడిని మోటారు సైకిల్‌పై తీసుకు వస్తుండగా వెనుకనుంచి వచ్చిన మరొక మోటారు సైకిల్ ఢీకొనడంతో భార్య, భర్తలు, కుమారుడు గాయపడ్డారని భీమవరం టుటౌన్ ఎస్సై రెహమాన్ గురువారం చెప్పారు. పట్టణంలోని బలుసుమూడికి చెందిన జి.మోహన్ రవితేజ తన కుమారుడు ఇవాన్ పెదఅమిరంలోని ప్రైవేట్ స్కూల్లో చదువుతుండడంగా బుధవారం మధ్యాహ్నం స్కూల్ నుంచి ఇంటికి తీసుకు వచ్చేందుకు మోహన్‌రవితేజ అతని భార్య నమ్రత కృష్ణ మోటారు సైకిల్‌పై వెళ్లి ముగ్గురు తిరిగి వస్తుండగా చినఅమిరం గ్రామం వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి మరొక మోటారు సైకిల్‌పై గోనె సంచులతో వస్తున్న వ్యక్తి మోహన్‌రవితేజ మోటారుసైకిల్‌కు ఢీకొనడంతో ముగ్గురు గాయాలపాలయ్యారు. బాధితులు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## పీఎఫ్ సొమ్ముపై సమగ్ర విచారణ చేయాలి



జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకు వినతిపత్రం అందజేస్తున్న భీమారావు, కార్మికులు

**తణుకు అర్బన్:** తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధుల్లో ఉన్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ సొమ్ము అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో గురువారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సంబంధించిన పీఎఫ్ సొమ్ము ఏడాదికిపైగా వారి ఖాతాల్లో జమకావడం లేదని, సదరు కాంట్రాక్టరు దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. కార్మికుల బ్యాంక్ ఖాతాలకు పీఎఫ్ సొమ్ము జమ చేస్తున్నానని కాంట్రాక్టరు చెబుతున్నారని, కానీ వాస్తవానికి ఆ సొమ్ము వారి బ్యాంకు ఖాతాలకు జమ కావడం లేదని స్పష్టం చేశారు. తక్షణమే అధికారులు దీనిపై విచారణ చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే రెండు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణకు పారిశుద్ధ్య కార్మికుల తరపున వినతిపత్రాన్ని భీమారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ తణుకు శాఖ కార్యదర్శి ధర్మాని పుష్పలత, ఎం.వెంకటలక్ష్మి, వై.రత్నం, పి.విజయలక్ష్మి, నేకూరి లక్ష్మి, చింతాలు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర కాలువ ముంపు రైతాంగాన్ని ఆదుకున్న దాఖలాల్లేవ్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురామ్ నాయుడు

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని ఎర్ర కాలువ ముంపు రైతాంగాన్ని ఆదుకునేలా బీమా, రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి అందజేసి ఆదుకున్న దాఖలాల్లేవని వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడు విమర్శించారు. గురువారం సాయంత్రం తాడేపల్లిగూడెంలోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ విషయంపై శాసనమండలిలో ఎమ్మెల్సీల ద్వారా చర్చించడం జరిగిందన్నారు. రైతాంగానికి మేలు చేకూరేలా శాసన మండలిలో వాణి వినిపించినట్లు తెలిపారు. బుడమేరు ముంపు ప్రాంత ప్రజల్ని ఆదుకునేలా సీఎం చంద్రబాబు ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడుతున్నారని చెప్పి రెండు నెలలు కావస్తున్నా ఎటువంటి ప్రకటన లేదన్నారు. సముద్రంలో వేట లేని సమయంలో మత్స్యకారులను ఆదుకునేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.10వేలు అందజేసిందన్నారు. అయితే, కూటమి ప్రభుత్వం రూ.20వేలు ఇస్తామని ప్రకటించిందని, బడ్జెట్‌లో మత్స్యకారులకు, రైతులకు ఆ మేరకు కేటాయింపులు లేవన్నారు. ప్రభుత్వ పాలసీల అమలుకు సోషల్ మీడియా కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రజల సమస్యలపై కలిసికట్టుగా పోరాడతామన్నారు. తనపై కార్యకర్తలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి అండగా ఉంటానన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# తణుకులో పందుల స్వైర విహారం

- మురికి కూపాలుగా మారుస్తున్న ఖైనం
- ఎన్జీవో, బ్యాంక్ కాలనీల్లో సంచరిస్తున్న పందులు
- ఏ జబ్బులొస్తాయోనని భయపడుతున్న ప్రజానీకం



తణుకు బ్యాంక్ కాలనీలో యల్లారమ్మ తల్లి గుడి ముందు పందులు

**తణుకు అర్బన్:** వ్యాపార వాణిజ్యపరంగా దేదీప్యమానంగా వెలుగునిచ్చిన తణుకు ప్రాంతం నేడు పందులకు ఆవాసంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తణుకు ఎన్జీవో, బ్యాంక్ కాలనీలతోపాటు పాతవూరులో యథేచ్ఛగా తిరుగుతున్న పందులు స్థానికంగా అపరిశుభ్ర వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం నిద్రలేచి బయటకు రాగానే ముందుగా మా కంటికి కనిపించేవి పందుల గుంపేనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందుల సంచరిస్తున్న ప్రాంతాలు మురికికూపాలుగా మారిపోతున్నాయని ముఖ్యంగా బ్యాంక్ కాలనీలోని శ్రీయల్లారమ్మ తల్లి ఆలయం ముందు ఈ పందులు తిష్టవేస్తున్నాయని దీంతో ఆలయ ప్రాంగణం కంపు కొడుతుందని వాపోతున్నారు.

**గత ఐదేళ్లు ఏమయ్యాయి**

పందులు సంచరించడంతో రకరకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ముఖ్యంగా స్వైన్‌ఫ్లూ వంటి ప్రమాదకరమైన జబ్బు వస్తుందనే ఉద్దేశ్యంతో గత ఐదేళ్లుగా పందులను ఊరి చివర కంపోస్టు యార్డుకు పరిమితంచేశారు. దీంతో అసలు పందులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. అటువంటిది ప్రభుత్వం మారగానే కంపోస్టు యార్డుల్లో ఉన్న పందులు ఊరిమధ్యలోకి వచ్చేసాయి. గత జగన్ ప్రభుత్వ హయాంలో తణుకులో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మునిసిపల్ అధికారులు, పందుల పెంపకందారులతో మాట్లాడి ఊరికి దూరంగా ఉంచేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గత ఐదేళ్లు పందులను చూద్దామన్నా కనిపించని పరిస్థితి ఉండేది. కానీ నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక మన రాజ్యం వచ్చిందన్నట్లుగా హల్‌చల్ చేస్తున్న తీరును ప్రజలు చీదరించుకుంటున్నారు. ఇప్పటికే ప్రతి గడపలోను జ్వరాలతో బాధపడుతూ మంచానికే పరిమితమవుతున్న రోజుల్లో ఇప్పుడు కొత్తగా పందులు కూడా సంచరిస్తుండడంతో ఏ జబ్బులు దాపురిస్తాయోనని ప్రజానీకం భయపడుతున్నారు. పందులు తిరుగుతున్నా మునిసిపల్ అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

#### మురికికూపంగా మార్చేస్తున్నాయి



తణుకు ఎన్జీవోకాలనీలో పందుల బెడద ఎక్కువగాఉంది. డ్రెయినేజీలలో దొర్లి ఇంటి గుమ్మంలోకి వచ్చేస్తున్నాయి. పందుల సంచారంతో మా ప్రాంతమంతా మురి కికూపంగా మారిపోతుంది. కాలనీలో అధికశాతం విద్యావంతులు, పదవీ విరమణ పొందినవారు ఉన్నారు. వీరంతా ఎన్జీవో కాలనీలో వాతావరణం పచ్చగా ఉండి ప్రశాంతంగా ఉంటుందని ఈ ప్రాంతంలో నివాసాలు ఏర్పాటుచేసుకున్నారు. నేడు పందులకు ఆవాసంగా మారిపోవడం బాధాకరంగా ఉంది.

– బొల్లా దుర్గాప్రసాద్, తణుకు ఎన్జీవో కాలనీ నివాసితుడు

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తణుకు అర్బన్:** విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా తణుకు, అత్తిలి, ఇరగవరం, పైడిపర్రు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలో బ్యాంక్ కాలనీ, రైల్వేస్టేషన్, ఆపిల్ హాస్పిటల్, ఎస్ఎస్‌సీ బోస్ రోడ్డు, నరేంద్ర సెంటర్, వేల్పూరు రోడ్డు, ఉండ్రాజవరం సెంటర్, టి.వేమవరం, ఎన్జీవో కాలనీ, మునిసిపల్ కార్యాలయ ప్రాంతం, కొండాలమ్మ పుంత, ఎన్టీఆర్ పార్కు, పాత బెల్లం మార్కెట్, సాయి హాస్పిటల్ ప్రాంతాల్లోను, తణుకు మండలంలో మండపాక, పైడిపర్రు, హౌసింగ్ కాలనీలోను, ఇరగవరం మండలంలో గోటేరు, యర్రాయిచెర్వు, కేతావారిపాలెం, కాకుల ఇల్లింద్రపర్రు, గోపాలపురం గ్రామాల్లోను, అత్తిలి మండలంలో అత్తిలి, మంచిలి, పాలూరు, ఉరదాళ్లపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

**తాడేపల్లిగూడెంలో..**

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని మాధవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** తాడేపల్లిగూడెం వన్ టౌన్‌లోని హౌసింగ్ బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు విద్యుత్ సబ్ స్టేషన్లు పరిధిలో ఈ నెల 22వ తేదీ శుక్రవారం విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించారు. అదే విధంగా టూ టౌన్‌లో పడాల ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పడాల గురువు, యాగర్లపల్లి, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.